
587
నవజ్యోతి ఫిలిమ్స్
పెట్టుకుంటే పదివేలు
నిర్మాతలు
సాంబశివరావు,వందనం
దర్శకత్వం
ఎం.మల్లిఖార్జునరావు

కథ: ఆపట్టణంలో జరుగుతున్న విచిత్రమైన దొంగతనాలకి, దారుణమైన హత్యలకి మూలకారణం పాతకేడీ అయిన నరసింహం అని పోలీసులు పసిగట్టారు కాని ఎన్ని వలలు వేసినా నరసింహం తప్పించుకుంటూనే ఉన్నాడు. నేరాలు జరుగుతూనే ఉన్నాయి ప్రజల భయాందోళనలు ఎక్కువైనాయి. ఆ హంతకుడు నరసింహాన్నిగాని, అతని శవాన్నిగాని అప్పగించినవారికి పదివేల రూపాయల బహుమానం ప్రకటించింది ప్రభుత్వం. మారువేషంతో తిరుగుతున్న నరసింహం తనచిన్ననాటిమిత్రుడు సత్యమూర్తిని ఒకనాడుకలుసుకుంటాడు. సత్యమూర్తి ఆ పట్నంలో వినాయకా బాంకులో గుమాస్తాగా ఉంటున్నాడు అతనిలో ధర్మం. న్యాయం నిండుగామూర్తీభవించి ఉన్నాయి. సత్యమూర్తి ఎంత ఉత్తముడో అంత అమాయకుడు. నరసింహం చెప్పిన కట్టుకథ నమ్మి, తన స్నేహితుడిగా ఆదరించి, ఇంటికి తీసుకువస్తాడు సత్యమూర్తి.

సత్యమూర్తికి ప్రేమ అనే కూతురు, రాము అనే కొడుకు ఉన్నారు భార్య పోయినప్పటినుంచీ. పసిపిల్లలకి తనే తల్లీ తండ్రీఅయి కంటికిరెప్పలా పెంచుకు వస్తున్నాడు అతని ప్రాణాలకి ప్రతిబింబాలు వాళ్లు శాంతమ్మ అనే ఆవిడ సత్యమూర్తి ఇంట్లో వంటచేస్తూంటుంది. ఆవిడకొడుకుదైవాధీనం ఊళ్ళో Taxi టాక్సీ నడుపుతూంటాడు. దైవాధీనం అతని మేనమామ కూతురు లక్ష్మి ఒకరినొకరు ప్రేమించుకున్నారు. దైవాధీనం ఎదురుకట్నం ఇస్తేగాని పెళ్ళి చెయ్యనంటాడు పేకాట సామ్రాట్టయిన లక్ష్మి తండ్రి పోనీ Taxi నడిపిడబ్బు సంపాదించి పారేద్దామంటే ఆ టాక్సీ తిన్నగా నడిచి చావదు.

ఒకసారి Taxi నడుపుతూ నరసింహం చేతిదెబ్బ తిన్న దైవాధీనం, ఆ నరసింహాన్ని సత్యమూర్తి ఇంట్లోచూసి హడిలిపోతాడు. ప్రేమ పుట్టినరోజు పండగ హడావుడిలో ఉన్న సత్యమూర్తిని కంగారుపెడతాడు ఈ నరసింహం, తన స్నేహితుడేనని, దుర్మార్గుడు ఎంతమాత్రం కాదని సత్యమూర్తి గట్టిగా చెబుతాడు. దైవాధీనం ఆమాట అయిష్టంగా మింగుతాడు.

— సత్యమూర్తి ఒక పెద్ద బాంకులో కాషియర్ అని తెలుసుకోగానే నరసింహంకి దురాలోచనలు మళ్ళీ పడగ ఎత్తుతాయి కపట నాటకమాడి, సత్యమూర్తిదగ్గరఉన్న బాంకు మాస్టర్ కీ ముద్ర మైనంమీదలాగి మారు తాళంచెవి తయారు చేస్తాడు.

పోలీసులు వచ్చి నరసింహం ఫొటో చూపెట్టగానే తెల్లబోతాడు సత్యమూర్తి- ఇన్నాళ్ళూ నరసింహం తన ఇంట్లో ఆడిన నాటకాన్ని అర్థంచేసుకుంటాడు- బ్యాంకుకు ఏం అపకారంచేస్తాడోనని అర్ధరాత్రి బ్యాంకుకు పరుగెడతాడు- అనుకున్నంతా అయింది- నరసింహము గూర్ఖానిచంపి బ్యాంకు దోచేశాడు, నరసింహం ఎక్కబోతున్న టాక్సీలో సత్యమూర్తికి, నరసింహానికి పెనుగులాటవుతుంది, తుపాకీ పేలుతుంది- నరసింహము చచ్చిపోతాడు: టాక్సీలో ఒకపక్కని శవాన్ని, మరొక పక్క బ్యాంకు సొమ్ము పెట్టుకొని మధ్యలో సత్యమూర్తి నిశ్చేష్టుడై ఉండిపోతాడు- అంతవరకూ టీషాపులోకూచున్న దైవాధీనం ఏదోబేరం వచ్చిందని టాక్సీ నడుపుకు పోతాడు!!

ఆ టాక్సీలో శవం ఏమవుతుంది? ఆ బ్యాంకు సొమ్ము [illegible]లన్నీ ఏమవుతాయి? సత్యమూర్తి గతేమిటి? ఏపాపమెరుగని దైవాధీనం ఏమవుతాడు? నరసింహంఅనుచరు చేతుల్లోపడ్డ సత్యమూర్తిపిల్లల గతేమిటి? లోపల శవముందని చూసుకోకుండా ఆటాక్సీలోకూచున్న ప్రయాణీకులకొచ్చిన ప్రమాదాలెటువంటివి_సమాధానం? తెర మీదే!!

పాటలు

పాట నెం 1 రచన : శ్రీ దాశరథి
కల్పన : రాము అండ్ ప్రేమ పాడినవారు : పి. సుశీల

స్వామీ వెంకటరమణా
తల్లివీ తండ్రివీ నీవే
మమ్ము లాలించి పాలించరావా దేవా ॥తల్లి॥
పూలలోన మధువు
పొదిగి వుంచినావు
ఆకలిగొను తుమ్మెదకు
అందించినావు ॥తల్లి॥
కారుచీకటులూ కల్పించినావు
కాంతిరేఖలను అందించినావు
చీకటులనుబాపి వెలుగుదారిచూపి
మా పాలిటి దేవుడవై కాపాడవయ్యా ॥తల్లి॥
నీవు కనరాని చోటేలేదు
నీవు వినలేని పిలుపేలేదు
మామొరాలకించి మమ్ములదీవించి
నీ చల్లనినీడలో నిలువనీయవయ్యా ॥తల్లి॥

పాట నెం 2 రచన : శ్రీ శ్రీ
పాడినవారు : పి. బి. శ్రీనివాస్, జయదేవ్, వసంత

సూత్రధారి : స్వాగతం - సుస్వాగతం
దైవాధీనం : నాకేనా
సూత్ర : సరసులైన యీ సభ్యులకు సుస్వాగతం
దైవా : శ్రమపడి వచ్చిన సభ్యుల్లారా స్వాగతం-
సుస్వాగతం.
సూత్ర : చల్లగ ఒకటికెట్టుకొని ఇంటిల్ల
పాదిగా వచ్చినవారికి స్వాగతం
ఎంతో ఎంతో స్వాగతం
దైవా : సొమ్మివ్వక టిక్కెట్టు తీసుకొని
రమ్మని తిప్పే రాజపోషకుల కిదే
సుస్వాగతం-మహా స్వాగతం
సూత్ర : మహాజనులారా యిప్పుడు మేము
ఆడబోయే నాటకం
దైవా : నాటకం గాదు
సూత్ర : నాటిక

దైవా : అసలేకాదు
సూత్ర : భరతనాట్యం
సూత్ర : అయితే మరేవిటి నీముఖం?
దైవా : అదే చూస్తావుగా—
దైవా : ఇంటావిడా వంటయిందా, లేదా?
లక్ష్మి : వంటకు బియ్యం అసలుంటేనా కాదా!
భూతం: నన్ను విముక్తిచేసిననరుడా ఏమినీకోరిక
వరం కోరుకో-కో-కో-కో
భయం మానుకో-ఓ-ఓ ఓ
నరుడా - నరుడా - నరుడా - నరుడా
దైవా : వరం కోరుకో నా గురుడా-నే
లక్ష్మి : వరం కోరుకో నా గురుడా—ఏం
యిద్దరూ:వరం యివ్వగలవోయ్ గురుడా—ఏం
వరం యివ్వగలవోయ్ గురుడా
భూతం : మిలమిలలాడే - మిసమిసలాడే
మేలిమి బంగరు కావాలా?
లక్ష్మి : అబ్బబ్బో! ఎంత బంగారం!
అయ్యయ్యో! ఎంత బంగారం!

మన యిల్లంతా — నా ఒళ్ళంతా
ఒకటే సింగారం
దైవా ; ఛీ — బంగారం చూడగానే దీనికి
మ[illegible]యింది - యిదే గ్రహచారం
యిదెక్కడి బంగారం -
ఎందుకు నాకీ బంగారు - ఇది
ఎదురుగ వుంటే కంగారు
ఇంత పసిడి నీకెక్కడిదని - వ
న్నేం జేస్తుందో సర్కారు
ఎచ్చట దాచను — ఏమిటి చెయ్యను
ఏమని చావను- ఎందుకీ బేజారు
అయ్య బాబోయ్ వద్దు -
భూతం : ఆకసమంటే - హాయినిగూర్చే
మేడలు మిద్దెలు కావాలా
దైవా : ఎందుకు నాకీ భవనాలు - అవి
చూస్తే గుండెలు దిగజారు
ఇన్ని గదులలో ఎలా బతకడం
ఉన్నది-నాకున్నది—ఉన్నది-ఒకపేయిల్లాలు

భూతం: పాపం ఒక్కటే యిల్లాలా-అయితే
అందం నిండీ-ఆనందం పండే
అన్నులమిన్నలు కావాలా!
అచ్చర కన్నెలు కావాలా

లక్ష్మి : ఛీ—అమ్మాయిల్ని చూడగానే
యీయనకు మతిపోయింది
అన్నులు వద్దూ మిన్నలు వద్దూ
అచ్చరకన్నెలు అసలేవద్దూ

భూతం : అయితే మరేం కావాలి

దైవా : మండుతున్నయ్ పొట్టలు

లక్ష్మి : నిండుకున్నయ్ కుండలు

యిద్దరు : అర్ధశేరు బియ్యంచాలు-అదేమాకుపదివేలు

భూతం , అయ్యయ్యో బియ్యమా!

దైవా : అవునయ్యా దెయ్యమా

భూతం : అదిమాత్రం నన్నడగొద్దు
ఆ సమస్య మాకూకద్దు

యిద్దరూ: అరచేతిలో స్వర్గం చూపిస్తారు
అర్ధ శేరు బియ్యం అడిగితే లేవంటారు.

పాట నెం 3 కల్పన-దెవాధీనం_పిల్లలు అండ్ కోరస్
రచన ; శ్రీ ఆరుద్ర పాడినవారు;జయదేవ్, వసంత & పార్టీ

ఏ ఫర్ ఆపిల్
బి ఫర్ బిస్కట్
సి ఫర్ చాక్లెట్
డి ఫర్ డాంకీ
నోనోనోనో—డాడీ ॥ఏ॥

తెలుగు ఇంగ్లీషూ—రెండూ చక్కనివే
తేనె చక్కెరలు—రెండూ తీయనివే
అ ఆ ఇ ఈ లు-అందం చిందాలి
ఏ బి సి డి లు — తెలివిని పెంచాలి ॥ఏ॥

పాఠశాలకు వెళ్ళేటప్పుడు— టాటా చెప్తాము
దార్లో టీచరు కనబడినప్పుడు-దండంపెడతాము
పేర్లువరుసగ పిలిచేటప్పుడు-ప్రెజెంటు అంటాము
జనగణమనఅనిపాడేటప్పుడుకదలకనిలబడతాం॥ఏ॥

నిన్న అంటే ఎస్టర్ డే
నేడు అంటే టుడే
ఆశలరేపే రేపు అంటే — అదే టుమారో

వెరీగుడ్ - వెరీగుడ్

బట్టీపెట్టి చదివితే ఫలితం గుండుసున్నా
మనస్సుపెట్టి చదవకపోతేమార్కులురావన్నా
చదివేటప్పుడు చదవాలి - ఆడేటప్పుడు ఆడాలి
సరదాగా కలసీ మెలసీ-చక్కగ పాడాలి ॥వె

భారతభూమీ కాపాడుటకై మీరేంచేస్తారు?
పటాలమందున తుపాకిపట్టి పహరా యిస్తాము
అన్యులువచ్చి దాడినిచేస్తే అపుడేంచేస్తారు?
హద్దులుదాటి పగవాడొస్తే పుట్ బాలాడేస్తాం
తెలుగుతల్లిని సేవిస్తాం-భరతభూమిలో జీవిస్తాం-
జీవిస్తాం

పాట నెం 4 రచన ; డా॥ సి. నారాయణరెడ్డి
దైవాతీనం-లక్ష్మి - పాడినవారు : మాధవపెద్ది & జానకి

నాంపల్లి స్టేషనుకాడ జాంపండ్లు బాగుంటాయే
ఏం పిల్లో - ఝూంపిల్లో
ఎకంగా ఎగిరిపోదామా? జాంపళ్లె తింటూ
ఎల్ల కాలంవుండి పోదామా? ॥నాం॥
నాంపల్లి స్టేషనుకాడ జాంపళ్లే తింటూవుంటే

ఓ బావో - నా బావో
సంసారం గడిచే దెట్టాగయ్యా?ఓర్ఝుంపలజయ్యా?
సరదాలు తీరేదెట్టాగయ్యా?

గుంటూరు సీమలోన గుత్తొంకాయలుబాగుంటాయే
ఏం పిల్లో - ఝూం పిల్లో
గూడెక్కి గుసగుస పోదామా?వంకాయలుతింటూ
గుడిసెకట్టి కాపురముందామా?

గుంటూరుసీమలోన-గుత్తొంకాయలుతింటూవుంటే
ఓ బావో-నా బావో
పొయిలోన పిల్లి లేచేదెట్టా-ఓ కబుర్ల పుట్టా
ఆకలిపోరాటం తీరేదింకాఎట్టా? ఎట్టా! ॥నాం॥

గుంతకల్లుసెంటరులోన-కూరగాయలికరువుందంట
ఏం పిల్లో - ఏం పిల్లో
గుంతకల్లుసెంటరులోన-కూరగాయలకరువుందంట
ఏం పిల్లో - ఝూం పిల్లో
కొట్టెట్టి బేరం చేదామా? లాభాలు గుంజీ
కొత్తమోగళ్లు బాగుకొందామా?

కూరగాయల యాపారంలో కొత్త కారు
ఏం గొంటావు
ఓ బావో - నా బావో
ఉన్నకారు వూడకుంటేచాలు-ఓ డ్రైవరు బావో
వన్నెచీర నాకు పెడితే చాలు
మరట్టాగయితే ॥నా౦॥

పాట నెం 5 రచన ; కొసరాజు
దైవాధీనం, లక్ష్మి - గ్రూపు పాడినవారు : జె.ఉ. దేవ్, వసంత & పార్టీ

సైరా చక్కని దేశం
జాల్మదియేల
భళిరా బంగారు దేశం
జాల్మదియేల
ఉన్నోళ్ళ కెన్నో వున్నయంటా
లేనోళ్ళ కేమి లేవంటా ॥సైరా॥
ప్రాజెక్టులే కట్టినారు
అహాం!
పంట కాల్వలే తవ్వినారు
ఓహో!
ఎన్ని చేసినగాని ఏముంది
తిండి కరువుబాధ తీరకుంది ॥సైరా॥
అధికంగా పండించమన్నారు
అదనంగా పన్నులే వేస్తారు_ ఓహో:
అదేమిటంటూ వివరమడిగితే
అది మీకే మేలన్నారు ॥సైరా॥
కల్లూ సారాయి మానమన్నారు—ఓహో!
యిల్లూ వల్లూ గుల్ల న్నారు
తీపి కల్లూ మళ్ళి తెచ్చారు
దేహానికే మంచిదన్నారు ॥సైరా॥
రంగు రంగు వేషాల్లో వున్నారు
అయ్యా!
దొంగో దొరో తేలకున్నారు
అమ్మా!
మంచీ మంచిగా దోస్తిచేస్తారు
మధ్యలోనే కొంప తీస్తారు ॥సైరా॥

★

తారాగణం

గుమ్మడి, చలం

రాజబాబు, అల్లు రామలింగయ్య

డా॥శివరామకృష్ణయ్య రామచంద్రరావు

త్యాగరాజు, చదలవాడ

గీతాంజలి, భారతి, మీనాకుమారి

సీతారాం, రాజారత్నం, బేబీ మల్లిక

బేబీ ఇందిర

– అతిధి నటులు :–

పద్మశ్రీ నాగయ్య, బాలకృష్ణ, మిక్కిలినేని, వల్లం నరసింహారావు.

సాంకేతిక నిపుణులు :–

నిర్మాతలు :	సాంబశివరావు, వందనం
దర్శకుడు :	ఎం. మల్లిఖార్జునరావు
రచన :	భమిడిపాటి రాధాకృష్ణ
సంగీతం :	టి. చలపతిరావు
కెమేరా :	లక్ష్మణగోరే
ఎడిటింగ్ :	మార్తాండ్
ఆర్టు :	పి. వెంకటరావు
ప్రొడక్షన్ :	జి. వి. రామకృష్ణారావు
అసోసియేట్ డైరెక్టరు :	యం. అప్పారావు
పబ్లిసిటీ :	మౌలీస్ & శ్రీకృష్ణ
స్టిల్సు –	చిట్టిబాబు
కాస్ట్యూమ్స్ :	టి. యస్. రామమూర్తి

★

–: ఈస్టిండియా రిలీజ్